AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
12-3-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

నకిలీ విత్తు..
రైతు చిత్తు..


2


2

మధ్యాహ్నం
భోజనం తనిఖీ

## ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఇటీవల ఎన్నికైన మున్సిపల్ ఛైర్మన్లు, సర్పంచ్, ఉప సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సర్పంచ్, కౌన్సిలర్ల శిక్షణ కార్యక్రమంలో ఎల్లారెడ్డిలో నిర్వహించారు. వారికి షబ్బీర్‌అలీ, కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించారు.

## పార్టీలకతీతంగా హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



**అక్షరటుడే, ఇందూరు:** పార్టీలకతీతంగా ప్రతిఒక్కరు హిందూ ధర్మ పరిరక్షణ కోసం సంసిద్ధుల అవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. నగరంలోని హనుమాన్ జంక్షన్‌లో హనుమాన్ దీక్ష స్వాములకు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో 54 ఫీట్ల భారీ హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అర్బన్ నియోజకవర్గానికి తలమానికమన్నారు. జిల్లాలో పేరుపొందిన ఆలయాల్లో హనుమాన్ జంక్షన్ ఒకటి అన్నారు. హిందువులు తమ ఇష్టం మేరకు ఏ పార్టీలో ఉన్న అంతిమంగా హిందువుల కోసం పాటు పడాలన్నారు. అఖిలభారత హనుమాన్ దీక్ష పీఠాధిపతులు దుర్గా ప్రసాద్ స్వామీజీ మంగళ శాసనములతో హనుమాన్ దీక్ష స్వాములకు ప్రతినిత్యం భిక్ష ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతం అని పేర్కొన్నారు.



## సిలిండర్ల కోసం బారులు.. ఏజెన్సీల వద్ద పోలీసు భద్రత

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలో వంట గ్యాస్ కోసం వినియోగదారులు పలు ఏజెన్సీల వద్ద బారులు తీరారు. ఆన్‌లైన్‌లో బుకింగ్ కాకపోవడంతో గురువారం భారత్ గ్యాస్ ఏజెన్సీ వద్దకు వినియోగదారులు భారీగా తరలివచ్చారు. అయితే నగరంలోని కొన్ని ఏజెన్సీల్లో మాత్రమే ఇలాంటి పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ కార్యాలయాలకు ఉదయం నుంచి వినియోగదారులు క్యూలు కడుతున్నారు. ఈ క్రమంలో వాగ్వాదాలు జరగకుండా ఉండేందుకు ఆయా ఏరియాల్లో పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తున్నారు. మరోవైపు అధికారులు జిల్లాలో గ్యాస్ కొరత లేదని చెబుతున్నారు. వదంతులను నమ్మి వినియోగదారులు ఒక్కసారిగా రావడంతో ఈ పరిస్థితి నెలకొందని వారంటున్నారు. గృహావసరాలకు ఎలాంటి కొరత లేదని.. కొన్ని ఏజెన్సీల్లో మాత్రమే కమర్షియల్ గ్యాస్ కొరత ఉన్నట్లు ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు.

## ముగిసిన ఫస్టియర్ పరీక్షలు..



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు గురువారం ముగిశాయి. దీంతో హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తమ లగేజీని సర్దుకుని ఇళ్లకు బయలుదేరారు. స్నేహితులతో సరదాగా గడుపుతూ, పరీక్షల ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతూ బస్సులు, ఇతర వాహనాల్లో హాస్టళ్లను వీడారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్



– మిగతా 2వ పేజీలో..

# రిజిస్ట్రేషన్ పేరిట వసూళ్లు



- వాహన షోరూం సిబ్బంది చేతివాటం
- బైక్‌కు రూ.600.. కారుకు రూ.3వేలు చెల్లించాల్సిందే
- పట్టించుకోని అధికారులు

**వాహనాల రిజిస్ట్రేషన్ పేరిట షోరూమ్ సిబ్బంది వసూళ్లకు పాల్పడుతున్నారు. ఏజెంట్లకు ఇవ్వాలని చెప్పి వాహనదారుల నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. వాహనాల యజమానులు రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లకుండా షో రూమ్‌లోనే రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేసింది. దీంతో ఏజెంట్ లేకుండానే రిజిస్ట్రేషన్ పూర్తవుంటుందని, వారికి ఇచ్చే డబ్బులు ఆదా అవుతాయని ప్రజలు భావించారు. కానీ కొన్ని షోరూంల సిబ్బంది ఏజెంట్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో కార్యాలయంలో తప్పినా.. షో రూమ్‌లో మాత్రం తప్పడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - అక్షరటుడే, ఇందూరు**

జిల్లావ్యాప్తంగా నిత్యం పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు, కార్లు విక్రయిస్తున్నారు. గతంలో వీటి రిజిస్ట్రేషన్ రవాణా శాఖ కార్యాలయంలో జరిగేది. కానీ ప్రస్తుతం వాహన షో రూమ్‌లోనే రిజిస్ట్రేషన్ పూర్తిచేసేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేసింది. అయితే షోరూమ్‌లో వాహన యజమాని ఫొటోతో పాటు దరఖాస్తును పూర్తి చేసి రవాణా శాఖ కార్యాలయానికి షో రూమ్ సిబ్బంది పంపాల్సి ఉంటుంది. అక్కడ అధికారులు ఆమోదం తెలిపిన తర్వాత వాహన రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. అయితే అధికారులు ఆమోదించాలంటే కొంత ఖర్చు అవుతుందంటూ షోరూం సిబ్బంది యజమానుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. వాహనాలు కొనుగోలు చేసేవారు సైతం చిన్న మొత్తమే కదా అని చూసి చూడనట్టు ఉంటున్నారు.

### ఇబ్బందులు తప్పుతాయనుకుంటే..

రవాణా శాఖ కార్యాలయంలో గంటల తరబడి వేచి చూడడం, ఏజెంట్ల దందా నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల షోరూంలోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. లైఫ్ టాక్స్, టీఆర్, స్మార్ట్ కార్డ్, ఇతరత్రా రుసుము షో రూమ్‌లోనే చెల్లించాలి. ఈనెల 1వ తేదీ నుంచి అమల్లోకి వచ్చిన రోడ్డు భద్రత రుసుము కూడా వసూలు చేస్తున్నారు. గతంలో ఆర్టీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సమయంలో ఏజెంట్లు డబ్బులు వసూలు చేసేవారు. కొత్త విధానంతో ఆ ఇబ్బందులు తప్పుతాయని ప్రజలు భావించారు. అయితే షో రూమ్ సిబ్బంది డబ్బులు అడుగుతున్నారు.

నిబంధనల ప్రకారం షోరూమ్‌లో మినహా రవాణా శాఖ కార్యాలయాల్లో పైసా చెల్లించాల్సిన అవసరం లేదు. అయినా కొందరు షో రూమ్ సిబ్బంది ఆర్టీఏ కార్యాలయాల్లో ఖర్చుల పేరిట వసూళ్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్ కావాలంటే అధికారులకు ఎంతో కొంత ముట్టచెప్పాలంటూ వాహన యజమానులకు చెబుతున్నారు. ద్విచక్ర వాహనంపై రూ. 600 నుంచి రూ. వెయ్యి వరకు, కారుపై రూ. 3 వేల వరకు వసూలు చేస్తున్నారు. కొన్ని షోరూంలల్లోనైతే ఏకంగా వాహనం కొనుగోలు చేసే ముందు వేసే కొటేషన్లలోనే వీటిని కూడా చెబుతున్నారు.

## ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, కామారెడ్డి:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకురావడానికి కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కామారెడ్డికి రింగు రోడ్డు, ఆర్వోబి నిర్మాణాలు, రైల్వే అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రులను కోరారు. తాజాగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును ఎమ్మెల్యే కలిశారు. కామారెడ్డి పట్టణం రాష్ట్ర రాజధానికి అతి తక్కువ దూరంలో ఉందని, జాతీయ రహదారి, రైల్వే స్టేషన్ అందుబాటులో ఉన్నాయన్నారు. కామారెడ్డిలో ఉన్న ప్రభుత్వ స్థలంలో ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటు చేస్తే యువతకి ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని మంత్రికి వివరించినట్లు తెలిపారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

## అగ్నిప్రమాదంలో పలు బైక్‌లు దగ్ధం

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ పాత పోలీస్ స్టేషన్ భవనం వెనుక భాగంలో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో పలు బైక్‌లు దగ్ధమయ్యాయి. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పాత పోలీస్ స్టేషన్ వెనుక పార్క్ చేసి ఉంచారు. అయితే గురువారం ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో పది వాహనాలు కాలిపోయినట్లు ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

## పెంకుటిల్లు దగ్ధం.. భారీగా ఆస్తినష్టం

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రమాదవశాత్తు పెంకుటిల్లు దగ్ధమైంది. ఈ ఘటన సదాశివనగర్ మండలం తిర్మన్‌పల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సున్నపు రాజుకు చెందిన ఇంట్లో గురువారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే పోలీసులు గ్రామానికి చేరుకుని ఇంట్లో ఉన్న ఓ వృద్ధురాలు, మరొక వ్యక్తిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అగ్నిమాపక శకటాన్ని రప్పించి గ్రామస్థుల సహకారంతో చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇంటి పైకప్పు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లోకి మంటలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి కాలిబూడిదయ్యాయి. ఇంట్లో దాచిన 20 తులాల బంగారు ఆభరణాలు కాలి ముద్దగా మారాయి. వెండి కూడా ఒకచోట ముద్దలుగా మారిపోయింది. రెండు తులాల గుండ్లు, మరొక 10 తులాల వెండి లభించడం లేదని బాధితులు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.



## కళాశాలలో మైనర్ పనిచేస్తుండడంపై కలెక్టర్ ఆగ్రహం..





**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా కేంద్రంలోని నాగారంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం తనిఖీ చేశారు. కిచెన్ డైనింగ్ హాల్‌లో సందర్శించి నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. కిచెన్ శుభ్రంగా ఉంచాలని లేనిపక్షంలో వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంటుందన్నారు. కళాశాలలోని హాస్టల్‌లో కిచెన్‌లో మైనర్ బాలిక పనులు చేస్తుండడానికి గమనించిన ఆమె ఆరా తీశారు. తన పెద్దమ్మతో కలిసి కొన్ని రోజులుగా కిచెన్‌లో వంట పనుల్లో సహాయం చేస్తున్నానని సదరు బాలిక కలెక్టర్‌కు తెలిపారు. దీంతో కళాశాల నిర్వాహకులపై కలెక్టర్ తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. చదువుకునే వయస్సు కలిగిన మైనర్ బాలికతో ప్రభుత్వ విద్యా సంస్థలో ఎలా పనులు చేయిస్తున్నారని నిలదీశారు. తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ కళాశాల ప్రిన్సిపల్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాలికను సమీపంలోని పాఠశాలలో చేర్పించి ఉచిత విద్యా, వసతి అమలయ్యేలా చూడాలని సీడీపీవో, ఎంఈవోలను ఆదేశించారు.

### పీహెచ్‌సీని తనిఖీ చేసిన కలెక్టర్

**అక్షరటుడే, ఆర్మూర్ :** మండలంలోని గోవింద్‌పేట్ పీహెచ్‌సీని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఆయా విభాగాలను సందర్శించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల తీరును గమనించారు. అందుబాటులో ఉన్న మందుల స్టాక్, వైద్యులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. వివిధ వార్డులను సందర్శించి రోగులకు కల్పిస్తున్న సదుపాయాలను కలెక్టర్ గమనించారు. మధుమేహం, మలేరియా వంటి వ్యాధుల నిర్ధారణ, వాటి బారిన పడిన వారికి అందిస్తున్న చికిత్సల గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి రాజశ్రీ తదితరులున్నారు.

## కేసీఆర్ ఖజానా ఖాళీ చేసినా పథకాలు అమలు చేస్తున్నాం




**అక్షరటుడే, కామారెడ్డి:** కేసీఆర్ ఖజానా ఖాళీ చేసి వెళ్లిండు.. అయినా పథకాలు అమలు చేస్తున్నామని షబ్బీర్ అలీ అన్నారు. ప్రజాప్రతినిధులకు ఆయా శాఖలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ ఛైర్మన్లు, కౌన్సిలర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి పాలనలో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని, సర్పంచులు వచ్చేలోపు సగం సమస్యలు దూరమయ్యాయన్నారు. గ్రామాల్లో రేషన్ కార్డుల సమస్య ప్రధానంగా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్డులు ఇచ్చి సన్నబియ్యం పంపిణీ చేస్తుందని తెలిపారు. గతంలో అధిక కరెంటు బిల్లులతో ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం సబ్సిడీ ద్వారా 90 శాతం మందికి ఉచిత కరెంట్ వస్తుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో రాష్ట్రంలో నంబర్-1 స్థానంలో ఉన్నామని, పనులు మరింత వేగం పెంచి త్వరగా లక్ష్యాన్ని చేరాలని అధికారులకు సూచించారు. గతంలో బేస్‌మిట్ ఉన్నవాళ్లకు కూడా కొత్త ఇల్లు నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం జీవో ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం వేసవికాలం నేపథ్యంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు సరిగా రావడం లేదని, ఆ సమస్య పరిష్కరించాలని అధికారులకు సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎన్ని ఎంఎల్‌డీ వాటర్ ఇస్తున్నారని మిషన్ భగీరథ ఈఈని అడగగా తన దగ్గర వివరాలు లేవని అధికారి చెప్పడంతో షబ్బీర్ అలీ సీరియస్ అయ్యారు. జిల్లా ప్రజాప్రతినిధులతో సమావేశం పెడితే అధికారి రావాలి కదా.. వచ్చిన వాళ్లయినా మొత్తం వివరాలను తీసుకుని రావాలి కదా అని అసహనం వ్యక్తం చేశారు. పైప్‌లైన్ పూర్తి చేస్తామని చెప్పిన గడువు లోపు చేయడం లేదని, ఎప్పటివరకు చేస్తారో కరెక్టుగా చెప్పాలని ప్రశ్నించారు. గ్రామాల్లో మిషన్ భగీరథ నీళ్లు రాకపోతే బోర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని కలెక్టర్‌కు సూచించారు. కేసీఆర్ ఖజానా మొత్తం ఖాళీ చేసి వెళ్లాడు, ఎన్ని ఇబ్బందులైనా అర్హులైన వారికి పింఛన్లు ఇస్తామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర అడిషనల్ కలెక్టర్లు విక్టర్, మధు మోహన్, ఏఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి నిఖిత, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపల్ ఛైర్మన్లు ఇప్ప ఉమారాణి, పద్మ శ్రీకాంత్, కాసుల విజయ, సీమ, తదితరులు పాల్గొన్నారు.



## పాడే మోసిన షబ్బీర్ అలీ.. ముగిసిన మాజీ జడ్పీటీసీ అంత్యక్రియలు


**అక్షరటుడే, కామారెడ్డి:** తూప్రాన్ సమీపంలోని మాసాయిపేట వద్ద రోడ్డు ప్రమాదంలో రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహానికి బుధవారం పోస్టుమార్టం పూర్తికాగా కామారెడ్డి పట్టణంలోని ఆయన నివాసానికి తీసుకొచ్చారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. మోహన్ రెడ్డి ఇంటివద్దకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు వచ్చారు. ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజు మోహన్ రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల్లో పాల్గొని మోహన్ రెడ్డి పాడెను మోశారు. అంత్యక్రియలకు రామారెడ్డి మండల ప్రజలే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో జనాలు తరలివచ్చారు.




## కల్తీపాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

**అక్షరటుడే, ఇందూరు:** కల్తీపాల ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయించాలని ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సమితి ప్రతినిధులు నగరంలోని ఫుడ్‌సేఫ్టీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ మాట్లాడుతూ.. హన్మకొండలోని మార్కెట్‌లో ఆహార కల్తీ విషయమై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారని.. ఈ తనిఖీల్లో పాలల్లో కొవ్వు శాతం నిర్దేశిత ప్రమాణాల కంటే తక్కువగా ఉన్నట్లు గుర్తించారని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలోనూ ఇలాంటి సంఘటనలు జరగకుండా ముందుస్తుగా తనిఖీలు నిర్వహించాలని వారు వినతిపత్రంలో కోరారు. నిజామాబాద్ జిల్లాలో ప్రతిరోజూ 50 వేల లీటర్ల పాలు అమ్మకం జరుగుతుంటే, అందులో 42 వేల లీటర్లు ప్రైవేట్ డెయిరీలు, ఆరువేల లీటర్లు విజయ డెయిరీ, మిగతా రెండు వేల లీటర్లు చిన్నచిన్న రైతు డెయిరీల ద్వారా విక్రయాలు సాగుతున్నాయన్నారు. పాల నాణ్యతపై టెస్ట్‌చెక్ నిర్వహించడం అవసరమన్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి మహాదేవుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తు.. రైతన్న చిత్తు..



**మార్కెట్‌లో రైతన్నపై నకిలీ విత్తనాల కత్తి వేళాడుతోంది. గ్రామాల్లో నకిలీ విత్తన దందా జోరుగా సాగుతోంది. దళారులు యథేచ్ఛగా గ్రామాల్లో తిరుగుతూ నాసిరకం విత్తనాలు అమ్ముతూ అన్నదాతలను దగా చేస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సీజన్ మొదట్లోనే విక్రయదారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు మాయమాటలు చెప్పి నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. గాంధారిలో ఈ దందా జోరుగా సాగుతోంది.**

**– అక్షరటుడే, గాంధారి**

- **గాంధారిలో జోరుగా నకిలీ విత్తన విక్రయాలు..**
- **గతంలో ఎర్రజొన్న.. నేడు మొక్కజొన్న**
- **రైతులను మోసం చేస్తున్న వ్యాపారులు**
- **పట్టించుకోని అధికారులు**
- **పోలీస్‌స్టేషన్‌లో రైతుల ఫిర్యాదు**

ఆరుగాలం కష్టపడితే తాము వేసిన పంట చేతికి వస్తుందనే ఆశతో రైతులు ఉంటే.. నకిలీ విత్తనాలు వారిని నట్టేట ముంచుతున్నాయి. గాంధారి మండలంలోని ఒక విత్తనాల దుకాణం నుంచి ఇటీవల రైతులు మొక్కజొన్న పంటకు సంబంధించిన విత్తనాలు కొనుగోలు చేశారు. అయితే విత్తనాలు వేసి రోజులు గడుస్తున్నా మొలకెత్తకపోవడంతో విత్తనాలు కొన్న దుకాణాదారుడిని సంప్రదించారు. అయితే కంపెనీకే సబంధమని తనను అడగవద్దని దుకాణాదారుడు దాటవేశాడు.

### పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన రైతు..

మండలానికి చెందిన సదరు విత్తనాల దుకాణానికి చుట్టుపక్కల అనేక ప్రాంతాలనుంచి రైతులు విత్తనాలుకొనుగోలు చేసేందుకు వస్తుంటారు. ఇదే నమ్మకంతో మండలంలోని రైతులు సైతం మొక్కజొన్న విత్తనాలు కొన్నారు. వర్ని మండలానికి చెందిన రైతు నెనావత్ రూప్ సింగ్ మరో రైతుతో కలిసి మండల కేంద్రంలోని విత్తన దుకాణంలో 12 మొక్కజొన్న విత్తనాల బ్యాగులు కొన్నారు. అవి ఎంతకీ మొలకెత్తకపోవడంతో పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు అందజేశారు. మండల కేంద్రంలోని ఆ విత్తన దుకాణానికి వివిధ మండలాల నుంచే కాకుండా వర్ని, మోస్రా, ఎల్లారెడ్డి పరిసర ప్రాంతాలు, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల నుంచి వస్తుంటారు. బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చారు. అయితే వ్యాపారుల మోసాలపై వ్యవసాయ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

### జాగ్రత్తలు తీసుకోవాలి..

మొక్కజొన్న పంటకు సంబంధించిన శాంపిల్లను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. శాస్త్రవేత్తలు కూడా వచ్చి శాంపుల్స్ తీసుకెళ్లారు. కానీ పూర్తిస్థాయి రిపోర్ట్ అందలేదు. అయితే రైతులు కూడా విత్తనాలు కొనేముందు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి. విత్తన ఫలితాలను ఇతర రైతులతో చర్చించాలి. వ్యాపారులు విత్తనాలు గురించి చెప్పినప్పటికీ ఆలోచించి కొనుగోలు చేయాలి.

**– రాజలింగం, ఏఈవో**

### తీవ్రంగా నష్టపోయాం...



మొక్కజొన్న విత్తనాలను కొనుగోలు చేసి విత్తాను. పెట్టుబడి వేలల్లో పెట్టి పంట వేశా. కానీ విత్తనాలు మొలకెత్తలేదు. దీంతో తీవ్రంగా నష్టపోయా. సంబంధిత వ్యాపారిపై పోలీసులకు ఫిర్యాదు చేశా. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. నకిలీ విత్తనాలు విత్తనాల షాపులకు రాకుండా చూడాలి. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. కంపెనీ ప్రతినిధులైనా స్పందించి రైతులను ఆదుకోవాలి.

**– రూప్ సింగ్, రైతు**

## పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**అక్షరటుడే, బాల్కొండ:** పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బాల్కొండ ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయని ఆయన తెలిపారు. మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ఆదర్శ పాఠశాల, ఒక కస్తూర్బా పాఠశాల, ఒక మైనారిటీ గురుకులం, ఒక మహాత్మా జ్యోతిబా పూలే గురుకులం, ప్రభుత్వ పాఠశాలల నుంచి 348 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా, ఐదు ప్రైవేట్ పాఠశాలల నుంచి 183 మంది విద్యార్థులు హాజరవుతున్నారని వెల్లడించారు. పరీక్షల నిర్వహణకు చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. బాల్కొండ మండలంలోని మూడు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వెల్లడించారు. బాల్కొండ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, కిసాన్‌నగర్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల సందర్భంగా విద్యార్థులకు తాగునీరు, ప్రథమ చికిత్స వంటి సౌకర్యాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.



## విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు 90 మందికి గురువారం ఎంఈవో వెంకటేశం పరీక్ష సామగ్రి అందజేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు తనవంతు సాయం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు సైతం ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ రాణించాలని సూచించారు. పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నర్సింలు, ఉపాధ్యాయులు లింగమూర్తి, కృష్ణారెడ్డి, దేవదాస్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాసిరాం పాల్గొన్నారు.






## ముగిసిన ఇంటర్ పరీక్షలు..





## కాలువలోకి దూసుకెళ్లిన కారు.. యువకుడి దుర్మరణం




**అక్షరటుడే, ఆర్మూర్:** కాలువలోకి కారు దూసుకెళ్లిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన ఆలూర్ మండలం గుత్ప గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుత్ప గ్రామ సమీపంలో రాత్రి సుమారు ఒంటిగంట సమయంలో ఈ ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న పెద్ద బైరి నారాయణ (31) ప్రమాద తీవ్రతకు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కారులో ఉన్న మరో యువకుడు క్యాసెల్ ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం విషయం తెలుసుకున్న గుత్ప సర్పంచ్ దశరథ్, ఉపసర్పంచ్ చిన్న రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోలీసుల సహాయంతో కారులో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. గాయపడిన ప్రవీణ్‌ను మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. నారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మధ్యాహ్న భోజనం తనిఖీ



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని తిప్పారం యూపీఎస్‌లో మధ్యాహ్న భోజనాన్ని గురువారం ఎంఈవో శ్రీహరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. విద్యార్థులతో మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. భోజనంలో నాణ్యత పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే మదన్‌మోహన్ చిత్రపటానికి పాలాభిషేకం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి/ గాంధారి:** నాగిరెడ్డిపేట మండలంలో ధర్మారెడ్డి గ్రామంలో గురువారం ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మహిళా సంఘాల సమావేశాల నిమిత్తం 17 స్త్రీశక్తి భవనాలను మంజూరు చేయించినందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే కృషితో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు మాధవి, మండల ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య పాల్గొన్నారు. గాంధారి మండలం తిప్పారం గ్రామానికి మహిళా సంఘ భవనాన్ని మంజూరు చేసినందుకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌కు సర్పంచ్ ప్రమోద మాధవరావు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్యే చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.

## ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో కంటివైద్య పరీక్షలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 46 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్యనిపుణుడు హరికిషన్ తెలిపారు. చికిత్స అవసరం ఉన్న ఏడుగురిని లయన్స్ క్లబ్ బాన్సువాడకు రిఫర్ చేసినట్లు తెలిపారు. 18 మందికి కంటి అద్దాలు అవసరమున్నట్లు గుర్తించామన్నారు. ఇద్దరిని హైదరాబాద్ సరోజిని కంటి ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు తెలిపారు. కంటి సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయవద్దని సకాలంలో వైద్యం చేసుకుంటే కంటిచూపు పోకుండా కాపాడుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## హోటళ్లపై సివిల్ సప్లయ్స్ అధికారుల దాడులు



**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలో హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై సివిల్ సప్లయ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రెండు రోజులుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో హోటళ్లలో అక్రమంగా వినియోగిస్తున్న 10 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత హోటల్ యజమానులపై మొత్తం పది కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇళ్లలో వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగించడం నిబంధనలకు విరుద్ధమని వారు పేర్కొన్నారు. అలా వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల నేపథ్యంలో కొంతమంది హోటల్ యజమానులు గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో తమ హోటళ్లను తాత్కాలికంగా మూసివేశారు. బాన్సువాడలో వంట గ్యాస్ సరఫరా తగ్గిపోవడంతో డిమాండ్ పెరిగిందని, గ్యాస్ పక్కదారి పడకుండా ఉండేందుకు ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని బాన్సువాడ డివిజన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ ఖాదర్ షరీఫ్ తెలిపారు.